# విచికిత్సకు చికిత్స




డా॥ ఎన్. రామచంద్ర

కసువు చిమ్మటం, బట్టలుతికి ఇస్త్రీచేయటం, రోజుకో హోటల్లోపడి తినటం పడక తప్పనిసరై పెళ్ళి చేసుకున్నాను. సుఖమయ జీవితాన్ని అమర్చుకోవటంలో వైఫల్యం పొందటం, వ్యక్తిత్వ వికాస వేగంలో సమాంతరంగా సాగిపోవటం చేతకాక సమన్వయలోపం జరిగి నేనీకాలపు వాణ్ణి కానేమో అనే అనుమానం తొలుస్తూ వుంటుంది.

ఒంటరిగా ఉన్నప్పుడు ఏమీ తోచక, ముఖ్యంగా సెలవు రోజుల్లో, పిచ్చి పిచ్చిగా రోడ్లన్నీ చుట్టేవాణ్ణి. సినిమా లాంటి వినోదాలు నా ఒంటికి సరిపడవు. కృత్రిమత, సాగతీత, మానవులకే అతీత శక్తుల్ని అంటగట్టటం వ్యక్తి అభ్యున్నతికి, విలాసానికి అంతగా తోడ్పడవు. ఇప్పుడు ఒంటరివాణ్ణి కాకపోయినా అవాళ చికాగ్గా వుండి తిరగాలనిపించి ఎప్పుడూ చూడని ఓ వీధికి వెళ్ళాను. షాపు ముందు పెద్ద గుంపు. అంతా మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి వాళ్ళలా వున్నారు. పైకెక్కలేక కిందికి దిగలేని తనం.

లోపలికి పోను పోను వంకర్లుగా సాగిన గది. ఒక్కొక్క భాగంలో ఒక జాతికి చెందినవి సెల్‌ఫోన్స్, కెమెరాలు, గడియారాలు, వి.సి.పి.లు, సిడీలు, డివిడీలు, వాషింగ్‌మిషన్లు – ఇదంతా ఒక విభాగం. రేడియోలు, టేప్‌రికార్డర్లు, వివిధ కంపెనీలకు చెందిన టి.వి.లు, సోఫాసెట్స్, డైనింగ్ సెట్స్, దీవానాలు, అన్ని రకాల ఫర్నిచర్ ఆయా తావుల్లో కొలువు తీరి ఉన్నాయి. ఆరు నెలలు లేదా మహా అయితే సంవత్సరం వయసు గలవి. వ్యక్తుల్ని; కొనుగోలు శక్తి అందుబాటులో ఉండీ – లేనట్లుండే వ్యక్తుల్ని అంతర్జాతీయ బ్రాండెడ్ ప్రలోభాలు స్థిమితంగా ఉండనివ్వటం లేదు. మితిమీరుతున్న వ్యక్తిగత ఆదాయాలు విలాస సంస్కృతికి ఆజ్యం పోస్తున్నాయి. సంపన్నుల సంఖ్య అత్యంత వేగంగా పెరుగుతున్న దేశాలలో భారతదేశం రెండవ స్థానంలో వున్నట్లు ఒక అంచనా, నిరంతరం సంపన్నులతో పోల్చుకోవటం వల్ల వ్యక్తి తాను మిగతా వాళ్ళకన్నా ఒక మెట్టు పైన ఉండాలన్నతపనతో అయోమయ స్థితిలో పడుతున్నాడనిపిస్తుంది. నేనూ అతీతుణ్ణి కాను.

కొన్ని వస్తువుల వద్ద ఆడవాళ్ళు, మరికొన్ని వస్తువుల మధ్య మగవాళ్ళు నిలబడి సందర్శకులకు వస్తువుల నాణ్యం, విలువ వివరిస్తున్నారు. లేని అవసరాన్ని సృష్టించి సరుకులు అంటగట్టే వ్యాపార నీతి ప్రదర్శిస్తున్నారు తియ్యటి మాటలతో.

"ఇవన్నీ వాడి పారేసిన వస్తువులు కదా! వీటి విలువ ఎలా నిర్ణయిస్తారు?" అడిగాను.

"బదిలీ అయిన ఉద్యోగులు, కుటుంబంతో విమాన ప్రయాణం చేసేవాళ్ళు తమ వస్తువుల్ని ఇక్కడ అమ్మి అక్కడ మళ్ళీ కొనుక్కుంటారు. వీటి వాడకందార్లు ఉన్నత వర్గాలవాళ్ళు కావటం వల్ల పెద్దగా లొసిగి వుండవు. మోటారు సైకిళ్ళు, కార్లు కూడా మేము సేకరిస్తాం. ఉజ్జాయింపుగా రేటు సగం చేసి, చిన్న చిన్న మరమ్మత్తులు చేసి ముక్కాలు రేటుకు అమ్ముతాం" సేల్స్‌మాన్ వివరించాడు.

హైస్కూల్ చదువు మొదలు ఇంజనీరింగ్‌లో పి.జి.చేసేవరకు నా ప్రవర్తనపై నాకో విడంబన ముండేది. నేనొక ప్రత్యేకమైన వ్యక్తిగా, విలక్షణంగా కనపడాలని, పిన్ను కొన్నా, పెన్ను కొన్నా నలుగురూ మెచ్చుకోవాలని, ఆశ్చర్యపడాలని, నా స్నేహం కోరి నా వెంట తిరగాలని,నన్నే ఆరాధించాలని, చదువులో కూడా నేనెప్పుడూ వెనక పడలేదు.

"ఘటం భింద్యాత్ పటం చింద్యాత్ కుర్వాత్ రాసభ రోహణం
ఏనకేన ప్రకారేణ ప్రసిద్ధః పురుషోభవేత్"

మోస్తున్న నిండు కుండ పగలగొట్టి, తొడుక్కున్న కొత్త చొక్కా చించి, గాడిదపై సవారు చేసి – ఏదో ఒకటి – ఇతరులు చేయనిది చేసి వ్యక్తి ప్రత్యేకతను నిరూపించుకోవాలట. అసహజమైన ధోరణి కావచ్చు, మెగలోమానియాలాంటిదైనా కావచ్చు. స్నేహమంటే ప్రాణం, ఆడవాళ్ళంటే బెరుకు, బిడియం, శత్రుత్వానికి మాత్రం దూరం.

పాత వస్తువుల్ని పరిశీలించేటప్పుడు ఒక చోట నా దృష్టి ఆగింది. కొంచెం ముందుకు వెళ్ళి మళ్ళీ వెనక్కి వచ్చాను. ఆ వస్తువును ఎక్కడో చూసినట్లుంది. నా వేళ్ళు, నా చేయి, నా మనసు తాకి ఆనందించిన వస్తువు. వస్తువును పోలిన వస్తువుండ వచ్చుని ఎంతగా సరిపెట్టుకున్నా మనస్సు ముందుకు పోయేందుకు అంగీకరించలేదు. అక్కడున్న సేల్స్‌మాన్ "ఏమండి ! ఆ వస్తువును కొంటారా" అని అడిగాడు. కొనే ఆలోచన లేదు. చూడాలని ఆసక్తి వుందని చెప్పాను. జపాన్‌లో తయారైన చక్కని టేప్‌రికార్డర్, ఏవో పాత గుర్తులు 'నీ దాన్నే' అని చెప్పినట్లయింది. ట్యూన్ చేస్తే అద్భుతమైన అనుభూతిని అందించే అది నాదే, నాదే. ఇక్కడికెలా వచ్చింది? ఏ దొంగైనా కొట్టుకొచ్చాడా? ఇంట్లో వాళ్ళే అమ్మేశారా?

నేనేది దాచుకోను. మొదటిరాత్రి నాడే నా ఆదాయం గురించి చెప్పేశాను. బహుశా పెళ్ళి కంటె ముందే పెళ్ళిపెద్దలు అన్నీ ఆరాలు తీసే వుంటారు. కొంత ఖర్చుకు, కొంత మిగుల్చుకునేందుకు అనే కట్టుబాట్లు గృహ నిర్వాహకులకు పట్టదు కాబోలు. ముప్పై రోజులు గడిస్తే మళ్ళీ నోట్లకట్టలు వస్తాయనే ధీమా కూడా కావచ్చు. కాలం మారింది. మున్సిపల్ పైపులు మొరాయిస్తే నూతిలోంచి నీళ్ళు తోడుకునే రోజులు కాకపోయె. స్నానాలకు కూడా మినరల్ వాటర్‌ను ట్యాంకర్స్‌లో తెప్పించుకొనే రోజులు. ఇట్లాంటి ఇబ్బందులు వస్తే మా ముందు తరం వాళ్ళు స్నానాలే మానేవారట. కూరగాయలు ఇంటికి రాకపోతే మాంసం ఆలోచనలు వస్తాయి, లేదా స్టార్ హోటల్ లంచ్‌కు పిలుస్తుంది. ఆటో దొరకటం ఆలస్యమైతే పక్కనే ఉన్నజ్యూయలరీ షాప్స్ ఆడవాళ్ళ కళ్ళని మెరిపిస్తాయి. సొంత కారుంటే ఇలాంటి ఆలోచనలు రావుకదా అని మగవాళ్ళను కన్సోల్ చేస్తారు. ఆటోఖర్చు అరవై అయితే షాపు ఖర్చు అరవైవేలు. మా నాన్న కామాసిలో పండిన పంటలో కొంతభాగం మరుసటి పంటకు దాయడం వుండేది. మిగిలిన భాగంలోనే తిండి, అవసరాలు, ఆరోగ్యం కాపాడుకోవాలి. ఒంటె ఒకసారి నీళ్ళు తాగి ఆరు నెలలు దాచుకుంటుందట. వానరాకడ కనిపెట్టి చీమలు తమ నెలవుల్లోకి ఆహారం చేరవేసుకుంటాయి. మరి మనిషి !


అలా యిలా తిరిగి టేప్‌రికార్డర్ ఆరాకోసం త్వరగానే ఇల్లు చేరుకున్నాను. టేప్‌రికార్డర్ వరకే ఆలోచనలు ముసురుకుని లోపల ఇంకేయే వస్తువులు

## దుఃఖకాంక్ష

చీకటి మనిషిని కప్పుకుంటున్నప్పుడు
బ్రతుకు దృశ్యా దృశ్య వాకిళ్ళ నడుమ
గానం ఘనీభవించిన క్షణాన
స్వర చిత్రాలకు రెక్కలు తెగ్గొట్టబడ్డాయి
ఏ ఆచ్ఛాదనా లేని శరీరం ఒకటి
చీకటితో నర్తించడం మొదలు పెడ్తుంది
అంతా ఆకలి బాధ
పోరాటం బ్రతుక్కీ జీవితానికీ మధ్య
శబ్ద చైతన్యం ఉండదు
కన్నీటికీ కవిత్వానికీ మధ్య
జ్ఞాపకం అదృశ్యమయిపోయినాక
దూరం నుంచే దరహాసాలు వీడ్కోలు చెప్తాయి
ఆకలి చాలా పురాతనమయింది
అది దుఃఖపు వాకిళ్ళను తెరుస్తుంది
బాధల పరదాల్లోకి నెట్టి వేస్తుంది
యవ్వనానికి సన్యసించటం తెలియదు
అంతా యతల మయం
చరిత్ర పరిశోధనకి కన్నీటి చుక్క సరిపోదు
బ్రతకడం గొప్ప సాహసమే
ఎంత భూమి ఉన్నా
చుట్టూరా దుఃఖంతో నిండిన సముద్రం ఉంది
ఆశలకు చేతులు తప్ప చూపులు లేవు
నవ్వు మనిషికి సహవాసి
ఒక్కోసారి పక్కనే ఉంటుంది... మరోసారి ఉండదు
అంతరస్పర్శ ఆకలికి తెలియదు
కాలం పెంపుడు కుక్కలా నీదగ్గరే కూర్చొదు
నీ నీడే నీ మృత్యువు
నీ సహచరి... నీ ప్రేయసి
మనిషిలోంచి మనిషి బయటకు రాలేదు
మనసు నుంచి తప్పించుకోనూ లేదు.

– షేక్ ఖాదర్ షరీఫ్

ఆ షాపులో వున్నాయో పూర్తిగా చూడలేకపోయాను. దొంగతనమే జరిగి వుంటే వివరాల తోటి పోలీసులకు కంప్లైంట్ ఇవ్వాలి. ఇంకేమేం ఇల్లు దాటాయో ? నేను గడప దగ్గరకు చేరుకోకముందే "ఇంట్లోనే సినిమా హాలు ఏర్పడిందా" అనేంత శబ్దం - డి.టి.యస్. సినిమాహాల్లో లాగా! ఎంత వెడల్పాటి టి.వి.అయినా ఇంత శబ్ద మిస్తుందా? ఆ పేటలో ఆ యిళ్ళన్నీ ఒకే టైప్‌లో ఉన్నందువల్ల "ఇది మా యిల్లేనా" అని కూడా అనుమానం రాకపోలేదు.




శ్రీమతి సోఫాపై పాటకు అనుగుణంగా దరువు వేస్తూ వీధి గుమ్మం వేపు వీపు ఆంచి కూచుని సంగీతం ఆస్వాదించటం గమనించాను. షాపులో కొలువు దీరిన టేపు మాదే అని నిర్ధారణ అయింది. ఆరు నెలలు కూడా వయసు దాటని టేపుకు అపుడే నూరేళ్ళు నిండాయన్నమాట. ఫ్యాక్షన్ బేస్ట్ పిక్చర్ కాబోలు పెద్ద శబ్దంతో డిష్యుంలు పిడుగుపాటులా వున్నాయి. నా రాకను శ్రీమతి గమనించలేదు. ఏ దొంగనైనా దూరినా వాడి అదృష్టం, దొరికిందల్లా పట్టుకు పోవచ్చు.

ఆమె దరువుకు నేను కూడా తాళం వెయ్యకపోతే మళ్ళీ కసువు చిమ్ముకోవాలి, బట్టలుతికి ఇస్త్రీ చేసుకోవాలి, హోటల్ కూడుకు మరగాలి. స్వప్న ఆమె పేరు, సుప్పీ నేను పిలుచుకొనే ముద్దుపేరు. రేటు, షాపు, డివైజ్ కంపెనీ - అన్నీ బాగున్నాయని మెచ్చుకున్నా, నాలో ఏమూలో కోపం మండుతుంటే చల్లార్చేందుకు వెరైటీ చికెన్ వంటకంతో నీళ్ళు చల్లింది. నేనైతే కొన్ని పాత వాసనల వల్ల వెనుకబడి వున్నాను కాని కొత్త బ్రాండ్లు, కొత్త మోడళ్ళ కోసం జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లోని వాణిజ్య పత్రికల్ని తిరగేయడంలో మా ఆవిడ చాలా స్పీడులో ఉంటుంది. సర్క్యులేషన్ బాగా వున్న పత్రికల్లో వాణిజ్య ప్రకటనలే ప్రధాన వార్తలవుతాయి.

ఇంటికీ, ఒంటికీ సరికొత్త కళను కల్పించే ఆధునాతన ఎలక్ట్రానిక్ పరికరాలు, రెడీమేడ్ దుస్తులు, నగలు కొనుగోళ్ళకు ప్రోత్సహించే అప్పర్ మిడిల్ క్లాస్ సంపన్నుల్ని ఈనాటి మార్కెట్ సంస్కృతి ఆకట్టు కోవటం కాదు, ఆహ్వానిస్తుంది. అంతర్జాతీయ బ్రాండెడ్ ప్రలోభాలు మనుష్యుల్ని స్థిమితంగా ఉండ నివ్వడటం లేదు. అన్నీ వుండి ఏమీ లేనట్లు బాధపడి పోయే మధ్యతరగతి విచికిత్స మనస్తత్వానికి సోకిన సరికొత్త వైరస్. ఇది అంటువ్యాధి కంటే భయంకర మైంది కావచ్చు.

యూనివర్శిటీలో పి.జి. చేసే రోజుల్లో హాస్టల్లో టిఫిన్ చెయ్యటం, సండే హాస్టల్లో భోజనం చెయ్యటం తక్కువస్థాయి వ్యక్తులుగా పరిగణింప బడటం నాతోనే మొదలయిందేమో ! కొందరు స్టూడెంట్స్ రాత్రి పది వరకు చదివి పడుకొని తెల్లారి అయిదుకు లేచే అలవాటును కూడా అలాగే భావించడముంది. అలాంటి వాళ్ళను ముద్దపప్పు, పుస్తకాల పురుగు అని ఎగతాళి చేయటమూ వుంది. బీచ్‌లో "లేచిపోండి" అనే దాకా వుండి, వస్తూ వస్తూ ఏ హైక్లాస్ హోటల్లోనో తిని పన్నెండు నుండి నాలుగు వరకు చదివి తొమ్మిదికి లేచి నోట్లో బ్రష్ వేసుకోవటం, యూనివర్శిటీ క్యాంటిన్‌లో టిఫిన్ తిని రెండో గంట కొట్టే టయానికి క్లాస్‌లోకి ప్రవేశించటం ఫ్యాషన్. వారానికొక్కసారి వచ్చే జర్మన్ క్లాసుకు దుమ్మా కొట్టటం గ్రేట్. పరీక్షల ముందు తెగ చదివి గడ్డం గీసుకునే వ్యవధి కూడా లేనట్లుండటం ఒక దర్జా. దొంగచాటుగా ఫారిన్ డ్రింక్ గదిలో తెచ్చుకొని ఉంచుకోవటం ఒక హోదా. సెలవు రోజుల్లో భీమ్లీకో, బొర్రాకేవ్స్‌కో గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్ళటం ఒక గుర్తింపు. బర్త్‌డే పేరుతో గర్ల్‌ఫ్రెండ్‌కు గిఫ్ట్, పబ్స్‌లో డిన్నర్ ఆఫర్ చెయ్యటం ఒక ప్రత్యేకత. ఇలా అడుగడుగునా కొలతలు, పోలికలు లేకుండా బ్రతకలేమేమో !

నేను చదివే రోజుల్లోనే నా మిత్రుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంపెనీ స్పాన్సర్ షిప్ కింద స్టేట్స్‌కు వెళ్ళాడు. అతని నెలసరి వేతనం మా ప్రాంతాల్లో పెద్దగా గుర్తింపు పొందింది. అదంతా బడాయి అని కొందరు కొట్టిపారేస్తే, కొందరు ఆశ్చర్యపోతే, కొందరు తమ భవిష్యత్తు కూడా అలా వుండాలని ఊహించు కున్నారు. నేనూ ఆ కోవలోనే గుర్తింపు పొందాలని కలలు కన్నాను. కొంత వరకు సాధించు కున్నాను.

"ఫలానా రోజు ఇండియాకు వస్తున్నాను, నీకేం కావాలో చెప్పు" అని ఫోన్ చేశాడు. రీడర్స్ డైజెస్ట్ లాంటి పత్రికలన్నీ తిరగేస్తూంటే ఒకచోట నా కన్ను దాటిపోకుండా మొరాయించింది. కొత్తగా పెళ్ళి అయిన మోజులో శ్రీమతి కేదైనా మంచి బహుమతి ఇవ్వాలనే తలంపు మెదిలింది. వెయ్యి డాలర్ల విలువ గల వ్యిట్టాన్ వేనిటీ బ్యాగు తెమ్మన్నాను. నా స్టేటస్ ఆమె ముందు తగ్గకూడదు. లక్షా ఇరవై వేల డాలర్ల ఖరీదు చేసే మాంట్ బ్లాంక్ పెన్, పదివేల ఖరీదు చేసే టీ షర్టు, ఏభై అయిదు వేల రూపాయల ఖరీదు చేసే జర్మన్ కంపెనీ ఐగ్నర్‌బ్రాండ్ లగేజి తెమ్మన్నాను. అడిగిందే తడవు ఇంత భారం ఒక మిత్రునిపై మోప వచ్చునా అనే విచక్షణ నాలో తలెత్తలేదు. శ్రీమతి అదో పెద్ద గిఫ్టుగా భావించినట్లూ లేదు. నా సైకాలజీ అంతా ఉపయోగించి కూడా ఆమె ముఖంలో ఏ భావం చదవలేకపోయాను. నోకియా బ్రాండ్ 'వెర్టు' మోడల్ లగ్జరీ మొబైల్ ఫోన్ తెమ్మనలేదని మూతి ముడుపేమో ? నాకు కూడా కొంత అసంతృప్తి లేకపోలేదు. విలియమ్ పెన్ కంపెనీ ఉత్పత్తిచేస్తున్న తొమ్మిదిన్నర లక్షల రూపాయలు విలువైన షీఫర్ బ్రాండ్ పెన్‌కు టెండర్ వెయ్యకపోతినే అని, 'ఎస్టీలాడర్' - డొన్నాకరణ్ శ్రేణి పరిమళ ద్రవ్యాల్ని తెమ్మనకపోతినే అని కూడా.పనిలో పనిగా డామ్ పెరిగ్నన్ షాంపైన్ తెమ్మన్నాను.

నేను గాని, నా శ్రీమతి గాని ఇన్నేళ్ళదాకా కళ్ళు మూసుకున్నామా ? తెరిస్తే ఏ ప్రపంచంలో ఉన్నామో అనే దిగులా ? ఆశ్చర్యమా ! అశక్తతపై దేబిరింపా ? వైరాగ్యమా ?

నేను వాడే హోండాపై ఆమెకు ఏనాడో మోజు చచ్చింది. మా ఆవిడ ఒకరిద్దరు స్నేహితు రాండ్రను వెంటేసుకుని తిరుగుతున్నప్పుడే నా హోండాకు కాళ్ళొచ్చాయనుకున్నాను.

"కొత్త కారు కొన్నావుగా ! ఇంక హోండాతో ఏం పని ? అమ్మేద్దామా?"

"అమ్మితే ! చిన్న చిన్న పనులకో, మార్కెట్‌కో వెళ్ళాల్సివస్తే నడిచిపోతావా?" ఆఫీసుకెలా వెళ్తావు?"

"కారుందిగా"

"కారు నాకు, నా కొరకే కొన్నాను, నా ఫ్రెండ్స్‌తో వెళ్ళాల్సి వస్తే కావాలనుకున్నాను. లక్షల ఖరీదు పలికే మెర్సిడెస్ బి.యం.డబ్ల్యు కారు కొంటావా ! అది నాకు, ఈ పాతకారు నీకు. అప్పుడు నీ హోండా ఇండియాలోని ఏ ఏట్లో తోసినా నాకు అభ్యంతరం ఉండదు. వోక్స్‌వ్యాగన్, లాంబోర్ఘిని, రోల్స్ రాయ్స్ ఫాంటం, బెంట్లీ ఫోర్డ్ కంపెనీల కార్లను నువ్వెలాగూ కొనలేవు. యాస్టన్, మార్టిన్ ఫెరారీ కంపెనీ కారును కొనగలవా ! అందువల్ల అన్నీ మూసుకుని హోండాతో సరిపెట్టుకో."

కొన్నైనా మూసుకోక తప్పింది కాదు.

పాతకాలపు క్రియేటివ్ రైటర్స్ నవలా నిర్మాణాన్ని మానుకొని ఇటీవల పెర్సనాలిటీ డెవలప్‌మెంట్ చిట్కాలపై పడ్డారు. తనతోపాటు వరుగెత్తమని నాగరికతను, మనిషిని కాలం నిద్రపోనివ్వదు. మా ఆవిడ ఫ్యాషన్ టెక్నాలజీ చదవటం నా ప్రాణానికి వచ్చింది. జాన్ గెలియానో యంగ్ బ్రాండ్‌లతో దేశవాళీ వస్త్ర వ్యాపారంలోకి చొచ్చుకొని వచ్చిన ఇటాలియన్ ఫ్యాషన్ గ్రూపు "ఇటియరీ యాక్సెసరీస్" కాస్ట్యూమ్స్ నేషనల్ బ్రాండ్ తన వ్యాపారాన్ని విస్తృతం చేసే ఉద్యమంలో నేటి యువ సామ్రాజ్యం మతులు పోగొట్టుకుంటోంది. మరో అంతర్జాతీయ అగ్రశ్రేణి సంస్థ జీన్‌పాల్ గొతియె రెడీమెడ్ దుస్తులతో ఇప్పటికే యువతను కొల్లగొట్టింది.

డియాజియో ఇండియా వీలయినంత త్వరలో తన జానీవాకర్ బ్లూ లేబుల్ కింగ్‌జార్జ్ "వి" బ్రాండ్ మద్యం మద్యపాన ప్రియుల్ని చిత్తు చేయబోతోంది. మార్లిన్ కార్ల్‌సన్ నెల్సన్ భారతదేశంలో డెబ్బయి విలాసవంతమైన స్టార్ హోటల్స్ ప్రారంభించబోతున్నాడు. కొన్నాళ్ళకు మన దేశాన్ని మనమే పోల్చుకోలేనంత మార్పు చెందే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే నేటి అడ్వాన్స్‌మెంట్. యువతకు ఎర. ఈ దుమారంలో నేనెక్కడ కొట్టుకుపోతానో ? శ్రీమతీ ! రామానుజాయనమః.

ఎన్ని ఆలోచించుకున్నా ఇల్లు చేరి ఇల్లాలితో గడపటం తప్పదు కదా ! హోండా టిక్ టిక్ శబ్దంతో ఇల్లుచేరాను. బయట కారు లేదు. పట్టుబట్టి డ్రైవింగ్ నేర్చుకుంది. షాపు వెళ్ళి వచ్చి నాకు ఏ షాక్ ఇస్తుందో! ఒకవేళ ఇంట్లో ఉంటే ! నాల్గుకిత్తాలు కాలింగ్‌బెల్ నొక్కాను. హతాశుణ్ణై తాళాల గుత్తికి పని చెప్పాను. హాల్లో టేబుల్ మీద లెటర్, పైన పేపర్ వెయిట్. అలా సోఫాలో కొంతసేపు కన్నుమూసి, స్నానంచేసి, రెండు పెగ్గులు స్కాచ్ సిప్‌చేసి డైనింగ్‌కు కూర్చున్నాను. శ్రీమతి రిస్ట్‌వాచ్ డమాస్ బంగారు గొలుసుది టైం తెల్పుతుందో లేదో ? ఎక్కడుందో, ఏమో ? గాడ్‌ఫ్రే ఫిలిప్స్ వారి సిగార్ ఘాటైన పరిమళం కమ్మగా ఆస్వాదిస్తూ నిద్రలోకి జారుకున్నాను.

ఏం తెచ్చుకున్నానో, కోరి తెచ్చుకున్నానో గాని నా మనస్తత్వానికి సరైన జోడి.

"రాత్రి పన్నెండు దాటింది. క్యాలెండర్‌లో తేదీ మారబోతోంది. వేళాపాలా పట్టించుకోవా? చెప్పిపోవచ్చుగా" !

"నువ్వు చెబుతున్నావా ? వేళకే వస్తున్నావా? ఇప్పుడేం కొంప మునిగింది ?"

పుట్టుకతోనే పుట్ల కొద్దీ కోర్కెలతో పుట్టే వాళ్ళనేమనాలి ? జనరేషన్ గ్యాప్. ఫెమినిష్టులు ఇచ్చిన స్వేచ్ఛ. ఈ అగాధాల్ని కలిపే వంతెనలు ఇంకా రూపు దిద్దుకోలేదు. ప్రశ్నించే గుణం గొప్పదే. ఎదిరించే గుణమే ఆలోచింపచేస్తుంది.

ఆఫీసుకు బయలుదేరేముందు బయటికి వస్తే కారు లేదు. అయినా కారుతో నాకేం పని? రిపేరు వచ్చిందా ? ఎవరినైనా డ్రాపింగ్ వెళ్ళి అక్కడ ఉండిపోయిందా ? నేనెందుకు అడగాలి ? అడిగినా సూటి సమాధానం వస్తుందా ?

✿ ✿ ✿

దయానా ఫారెల్, ఎరిక్ బెయిన్ హాకర్ అధ్యయనంలో భారతదేశ స్వరూపమే మారిపోయే పరిస్థితి రాబోవటం కాదు, వచ్చింది. వీళ్ళు రూపొందించిన కొత్త కొలమానాల్ని పరిగణనలోకి తీసుకోకపోతే అంతా అయోమయమే. ఈ కొత్త తరంలో సాధకులు, అసాధ్యులు అని రెండు తెగలు. నెలసరి ఆదాయం అయిదు లక్షలు సంపాదించే వాళ్ళు మొదటి రకం. పది లక్షలు సంపాదించేవాళ్లు రెండవ రకం. దాంపత్యంలో ఈ వ్యత్యాసం అటూ - ఇటూ కావచ్చు. సాయంత్రం నేను ఇంటికి వచ్చేటప్పటికి ఫోర్టిగోలో బెంట్లి కంపెనీ కొత్తకారు ధగధగలాడి పోతోంది. ఇంకా నెంబరు కూడా అలాట్ అయినట్లు లేదు. రన్నింగ్ కూడా మైలేజ్ డబుల్ డిజిట్స్‌లోనే వుంటుంది.

ఇంత ఖరీదైన కారు వాళ్ళు నాకు పరిచయస్థులై వుండరు. భారతదేశంలో లగ్జరీ కార్లపై మోజు ఇప్పుడిప్పుడే పుడుతోందా? లోపల శ్రీమతి తప్ప ఎవరూ లేరు.

"బయటికారు ఎవరిది ?"

"మనదే. పాతది అమ్మేశా. ఉదయం గమనించలేదా? మీరెక్కడ మనుషులండీ ! మా డాడి కొంత, అన్నయ్య కొంత, నా సేవింగ్స్ కొంత. మన హ్యూండాయ్ శాటాఫె పై కూడా బాగానే వచ్చింది. కొంత ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో తీర్చవలసి వచ్చింది. డాడీకి, అన్నయ్యకు ఎప్పుడిచ్చినా ఫరవాలేదు"

నేనేం కాబోతున్నానో నాకే అర్థం కాలేదు. రాద్ధాంతం కంటే రాజీమేలని జీవితం నేర్పిన పాఠం.

"ఈనైట్ డిన్నర్ ప్యూజీ ఫైవ్‌స్టార్‌లో. నా ఫ్రెండ్స్ పదిమంది ఉండవచ్చు. మీరు త్వరగా రెడీ అవండి".

నేను మొరాయిస్తే ఆగదు. బహుశ బిల్లు కళ్ళల్లో నీళ్ళు తెప్పించవచ్చు. లేదా రక్తమైనా. ఇంద్రుని ఐరావతం కూడా ఆ రోజుల్లో ఇంత ఖరీదుది కాకపోవచ్చు. గంజి తాగినా కడుపు నిండుతుంది, అమృతం తాగినా అంతే. గొప్పలకు పోవాలను కోవడం వల్లే ఈ తిప్పలు. పదిమందిలో ఆడ వాళ్ళెందరు, మగవాళ్ళెందరు? నా విచికిత్స.

వ్యక్తులు తమ విందులు, విలాసాలు, విహారాల కోసం పెట్టే ఖర్చు దేశ ఆర్థిక వ్యవస్థను జర్మని స్థాయికి తీసుకుపోవచ్చుని మెక్సెన్సే గ్లోబల్ సంస్థ అధ్యయనం. ప్రచార, ప్రసార సాధనాలు ఎప్పటి కప్పుడు కొంగ్రొత్త మోడల్స్ మనదేశ ప్రజల జీవన శైలిపై ప్రభావం చూపిస్తున్నాయా? నిన్న మొన్నటి వరకు వందమంది జనాభాకు 0.8 లాండ్‌లైన్ టెలిఫోన్లు ఉండగా ఈనాడు సెల్ వాడే భారతీయుల సంఖ్య ఇరవైకోట్లు దాటింది.

నిరంతరం సంపన్నులతో పోల్చుకుని ఇలా విచక్షణ లేని ఆర్భాటాలకు పోతే కుటుంబ అను బంధాలు దెబ్బ తినక తప్పదు. మన కెరీర్‌కు ఉపయోగపడని వారిని దగ్గరకు రానీయకూడదు - భార్య అయినా సరే ! మనల్ని గురించి ఎవరో ఆలోచిస్తున్నారనుకొంటేనే ఈ అభద్రతా భావం. కోటి రూపాయల విలువచేసే ఫెరారీ ఎఫ్ నాలుగు వందల ముప్పయి కారులో బయట తిరిగినా ఎవరూ పట్టించుకోరనే భావం మనల్ని తొలిస్తే తప్ప ఇతరుల మనసుల్లో మనం కీలుబొమ్మలంకాము.

వస్తువును చూసి మనస్సును పాడు చేసు కోవటమేమిటి? మిగతా వారికన్నా ఒకమెట్టు పైన ఉండాలన్న తపన అవసరమా ? వేగవంతమైన ఈ యుగంలో ఎవరూ ఎవర్ని గురించీ పట్టించు కోరు.

నా ఎ.టి.ఎమ్‌లో బ్యాలన్స్ లేదు. ఆమెది కూడా అంతే. తండ్రి అయినా, అన్న అయినా డబ్బు దగ్గర ఒకటే. అప్పులపాలై గొప్పలకు పోయేకంటె ఒక్క మనస్సును వశపరచుకోలేమా ! అప్పుల వాళ్ళ నోటీసుల చికాకులు మొదలయ్యాయి. పెళ్ళి చుట్టూ అల్లుకొన్న అనుభూతులు, ఉద్వేగాలు మనసును కలచివేశాయి.

"ఏమిటి ఇదంతా ?" ప్రశ్నించాను నోటీసులు చూపిస్తూ.

"పెళ్ళికి ముందే ఇవన్నీ ఆలోచించి వుండాలి" అదోరకపు చూపు. పెళ్ళే అన్నిటికీ మూలమైనట్లు.

"ఇంకేం మాట్లాడగలను ? పుట్టుకకు దాంపత్యంతోటేనా పూర్ణత ! శృంగారానికి, పున రుత్పత్తికి దాంపత్యం ఏమవసరం ? నిద్రకు గుడి సైనా భవంతి అయినా ఒకటే. ఆకలికి గంజైనా పరమాన్నమైనా ఒకటే. బుద్ధుడి "తృప్తి" సూత్రం ఏమైనట్లు ?

ఈ జెర్మన్ షెపర్డ్ నన్ను చూస్తే గుర్రు మంటుంది, ఆమెను చూస్తే తోకాడిస్తుంది.

కసువు చిమ్మటం, బట్టలుతుక్కొని ఇస్త్రీ చేసుకోవటం, రోజుకో హోటల్లో పడి తినటం పడకనే విడాకులు తీసుకున్నాను.